స్కెచ్

# తెలుగుపండితుని సకాలమరణం

కొండూరి నరసింహం

ఈమధ్యనే అప్రతిష్ఠ నగర హైస్కూలులోని ఆంధ్రాధ్యాపకులు ఆకస్మిక మరణానికి గురియైనారు. ఆ వార్తను రేడియోలో ప్రసారం చేయడానికి అవకాశం లేకపోయింది. అసలు తత్వాన్ని ఆరా తీయాలనే ఆరాటంలో అందె వేసిన చెయియైన మా ప్రత్యేక విలేఖరి అందాల రావు అవసర వ్యక్తుల దగ్గరకు వెళ్ళి ఆ తెలుగు పండితుల నిర్యాణవిషయంలో ఆయా అనుభూతి వాక్యాలను సేకరించాడు. అవి యిక్కడ ప్రచురిస్తున్నాను—రచయిత.

హెడ్మాస్టారు: క్షమాశాంతములతో చాకిరీ చేయడంలో వారికివారే సాటి. ఎదిరించి మాటాడడం ఎరుగరు. టీచింగ్ నోట్సు వ్రాయడానికి తికమక పడేవారు. కాని బాధపడైనా భారత మంత గ్రంథం వ్రాసేవారు. ఉపాధ్యాయ బృందం లోకల్లా ఊఁ...ఆ...అనని ఉదారులు. వారి మరణానికి విచారించి ఆఖరి పీరియడు అందరమూ స్కూలువదలి ఇండ్లకు వెళ్లాం. అంతకంటె ఏం చేయగలం.

సోదరోపాధ్యాయులు మా అందరిలో ఆయన ఉన్నట్టే ఉండేదికాదు. ఒకమూల ఒదిగి కాలక్షేపం చేసేవారు. కదిపితే కందిరీగల పుట్ట లాగ శృంగార పద్యాలు గానంచేసేవారు. వారి శీలానికీ మా జోహారులు.

విద్యార్థులు: మేము వెనకసీటులో వేరు సెనగకాయలు తింటున్నా, పాఠం కదిలి వెళ్లేది. కంఠజోడు కాంతిలో కారం ఎప్పుడూ ఎరగం. అల్లరిచేస్తే అదలించడానికి భయపడి హెడ్మాస్టరుగారికి చెబుతాననేవారు. వారి అమృత సూక్తులు మా శరీరాలమీద చల్లగాపడేవి. వారిని మేము మరువడానికి ప్రయత్నించలేము.

భార్య: గంపెడు పిల్లలు, కసరేవారైనా కాదు. కుచేలోపాఖ్యానం చెప్పి నవ్వుకొనేవారు మనకీసంసారం సముద్రమయితేనే పెద్దల సూక్తికి చరితార్థత అనేవారు. నా మాటకు వారు కాదనలేదు. వారి యాజ్ఞను నేను త్రోసిపుచ్చలేదు. తత్ఫలితమే ఈ అరడస్తా పిల్లలు. వారు నా జీవితాన్ని అంధకారంలోకి అనువదించారు. అనుభవించాలి.

చాకలి: ఇస్త్రీ అక్కరలేదు. ఉతికితే చాలనేవారు. వారి ఉద్యోగకాలమంతా ఒకే కోటు రెండే చొక్కాలతో గడిపేరని నా నమ్మకం. వారి పొదుపు మెచ్చతగింది. అంతా అలాటివారైతే మేమెంతో సుఖపడేవాళ్ళం.

కిరాణావర్తకుడు: అరువు ఆయన అడగలేదు. నే నివ్వలేదు. జీతం డబ్బులో సగమైనా నాకిచ్చేవారు. వారి ఔదార్యానికి ఆశ్చర్యపడేవాణ్ణి. అన్నప్పుడూ అనుములూ మినుములూ కంటె ఆముదాలే ఎక్కువ కొనేవారు. అరువు పెట్టని అలాటి ఆసాములు పోవడం నా దురదృష్టం.

ఇంటి యజమాని: వారీవూరువచ్చి పద్ధెనిమిదేండ్లు పైగా అయింది. ఒకటి రెండిళ్లుమారి, నాయింటికి వచ్చారేమో. ఎప్పుడూ స్వంత యిల్లు కట్టుకుందామనే ఆలోచనైనా వారికి కలిగియుండదు. అద్దె యిండ్లకే అకింతమయిన వారి జీవితం అదృష్టవంతమయింది.

న్యూసు యేజెంటు: నా పదేండ్ల వ్యాపారంలో ఒక్క పత్రికకైనా వారిని చందాదారుగా చేర్చలేక పోయేను. లైబ్రరీలున్నాయనో, రాజకీయాలు నాకెందుకనో అనేవారు. ఏమైనా భూగోళంతో వారికిగల సంబంధం తామరాకూ నీటిసంబంధమే. భూకంపాలు వచ్చినా భూపతులు మారినా, ఆర్థికమాంద్యం వచ్చినా ఆహార క్షామం యేర్పడినా చలించని వ్యక్తులని ముందుగా వారిని పోల్చింది నేనే. అట్టివారి నిర్యాణం ఆగ్రహకు తీరనిలోపం.

భీమాకంపెనీయేజెంటు: మానవుడు తదనంతర వ్యక్తులకొరకు ధనమును దాచిపెట్టడం తప్పనీ, ఇలాచేస్తే భావికాలపు సంతానం కష్టసుఖములు తెలియని కర్మీసరకవుతుందనీ, భీమా చేయనన్నారు తెలుగుపండితులు. ఆకస్మికమరణం



ఎడతెగని దగ్గు
ఇన్‌ఫ్లూయెంజా
శైత్యములకు
మీాకు కావలసినది

# పెప్సు

పెప్సు మంచిరుచిగల బిళ్ళలు, అవి మీా ఊపిరితో జబ్బుగల చోటికి ఔషధ సారములను పంపి శీఘ్రముగాను అమోఘముగాను పని చేయును మీారు పెప్సును చప్పరించినప్పుడు విషనివారక మైన వాటి ఆవిర్లు, దగ్గును ఆపి, వాచిన పొరలను శమనపరచును. క్రిములను సంహరించి, వూపిరి ధారాళముగా ఆడునట్లు చేయును రొమ్ముకు గొంతుకు వెంటనే శమనము గూర్చును.




# PEPS

విష నివారకమైన గొంతు, రొమ్ము, ఊపిరితిత్తుల జబ్బులకు అమోఘమైన చికిత్స

FPY-6.


సంభవించినవారికి ఆ భీమా లాభమిస్తుందని అవగాహన చేయబోగా "అశ్లీలము ప్రతిహతమగాక" అని చెవులుమూసికొన్నారు. పండితులు పరమపదించడం, పరమవిషాదవార్త.

**మునిసిపల్ కౌన్సిలర్:** నాదీ ఒక గొప్ప అధికారమనుకొనేవారేమో, నేనేసందు చివర కనుపించినా నమస్కారం చేసేవారా అమాయకులు. అట్టి భయాన్ని ఆయనకు కల్పించినదెవరో అన్వేషించాలి. అది న్యాయం.

**పుస్తక ప్రకటనకర్త:** ఆయన వ్రాసిన పుస్తకాలు అనేకచేతుల క్షేత్రు సొమ్ము చేసుకొంటున్నానని ఆయనకు తెలియునో తెలియదో. ప్రతిఫలం ఎప్పుడూ వదులుమీాదే అడిగేవాడు. అట్టి వ్యక్తి నిర్యాణం పెట్స్ బుక్కు కమిటీకి పెద్ద దెబ్బ.

**ఔనుహాలు మెంబర్లు:** ఎన్ని పేకలో చింపాము. ఎన్ని కల్లో త్రాగాము. ఎన్ని టీ పార్టీలో చేశాము. అట్టి పండితునికి సన్మానం చేయాలనే తలంపు మాకెప్పుడో గాని తలకాయలో మెదలలేదు. మా క్లబ్బు పొలిమేరలకైనా వారురాని దుర్దోషమోయేమో మా ఊహాలు నిజరూపం పొందకపూర్వమే నిర్యాణం చెందారను వార్త మమ్ములను నిశ్చబ్దులను చేసింది. వారి భార్యామణికి మా సానుభూతి.

**బట్టల వర్తకుడు:** పాఠశాలకు వచ్చేటప్పుడు వెళ్ళేటప్పుడు, అన్ని ఋతువులలోను దుప్పట్లుఖరీదేమైనా తగ్గిందా అని అడగకుండా వుండనివారు. వారు నాదగ్గర బట్టలుతీసిన రోజులు జ్ఞాపకంలేవు. కాని వారి విగ్రహం మాత్రం నిండు జ్ఞాపకం. పాపం! పోయేడు.

**ఫొటోగ్రాఫరు:** చాలా సంవత్సరాలక్రితం నాకు వారి భార్యతోకలిసి ఫొటో తీయించుకోవాలని చెప్పేరు. కాలక్రమంలో ఆ కోరిక వారికి ఎందుకు దూరమయిందో చెప్పలేను. ఇక ఆ మూర్తిని స్మృతికి తెచ్చుకొని ఫొటో తీయడం ఇంతలో సాధ్యంకాదు. అంతే...

**ఘోటానాయకుడు:** ఎంత చదువుకున్నా మీా వలె దండలు వేయించుకొని గౌరవింపబడే కాలం రాదంటూ ఒక్కవేడి నిట్టూర్పు వారు విడిచిన రోజు నాకు తెలుసు. ఏమైనా వారి శిలావిగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు త్వరలోనే ప్రోగుచేయాలి.

**పత్రికా రచయిత:** వ్యాకరణము విరివిగా వచ్చిన లోపంచేత ననుకొంటాను ఏ పత్రికలోను వారిపేర వ్యాసమేదీ ఉండేదికాదు. అచ్చులో నాపేరుచూచి వారు విభ్రమపడేవారు. సాంఘిక విజ్ఞానం విషయమై వారు కొన్ని సరిహద్దులు సృష్టించుకొన్న పాపం వారికి కీర్తితేకుండా చేసింది. వారి ఆశయాలేమిటో మనకేం తెలుసు?